## దివ్యాంగులకు చేయూతనివ్వాలి

◆ న్యాయమూర్తి రజిని



మాట్లాడుతున్న న్యాయమూర్తి రజిని

వనపర్తి టౌన్, డిసెంబర్ 2: దివ్యాంగులకు చేయూతనివ్వాలని న్యాయమూర్తి రజిని అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కేడీఆర్ కాలనీలో ఉన్న దివ్యాంగుల భవిత కేంద్రాన్ని జడ్జి సందర్శించారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యాయసేవ సాధికార సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేటి ఆధునిక సమాజంలో అనేక రకాల మెరుగైన పరికరాలు, సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయని, ఆధునిక శిక్షణతో సదుపాయాలు ఉపయోగించుకొని మెరుగైన తర్ఫీదు ఇచ్చి ప్రయోజనం చేయాలన్నారు. దివ్యాంగులను మంచి మనసుతో పలకరించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఉత్తరయ్య, వైద్యురాలు నదియా, కోఆర్డినేటర్ యుగంధర్, ఐఆర్పీ ఉమా, ఉదయ్‌కోటి, సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యాధినిరోధక టీకాలు వేయించాలి


అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌వో రామయ్య

పాన్‌గల్, డిసెంబర్ 2: చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని బండపల్లిలో బాలింతలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అప్పుడే పుట్టిన బిడ్డలకు తల్లిపాలు తాపించాలని, పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులు అవలంభించాలని కోరారు. బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రమాదేవి, శైలజ, విజయ తదితరులు పాల్గొన్నారు.

## కోటిలింగేశ్వర ఆలయంలో పూజలు


హోమాలు చేస్తున్న భక్తులు

కొత్తకోట, డిసెంబర్ 2: మండలంలోని దత్తకోటిలింగేశ్వర ఆలయంలో సోమవారం ఆరో రోజు 20 శివకోటి యంత్రాలకు రుద్రాభిషేకాలు నిర్వహించారు. కార్తీకమాసం సందర్భంగా ఈ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని 15 రోజులపాటు హోమాలు నిర్వహించనున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కండక్టర్ శేఖరయ్య, మహేశ్వర్, అర్చకులు జగదీశ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థికసాయం అందజేస్తున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి

పెద్దమందడి, డిసెంబర్ 2: పెద్దమందడి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఉమ్మల బాలరాజు గతనెల 22న రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. శనివారం కొత్తకోట సీఐ శ్రీనివాస్‌రెడ్డి కానిస్టేబుల్ కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు. జిల్లాలోని సీఐలు, ఎస్సైలు, పెద్దమందడి పోలీస్ స్టేషన్ సిబ్బంది కలిసి రూ.లక్షా50వేలను జమచేశారు. ఆట్టి డబ్బును కొత్తకోట సీఐ కానిస్టేబుల్ భార్య, కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పెద్దమందడి పోలీస్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

# కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

◆ వనపర్తి నియోజకవర్గానికి 14 టేబుళ్లు
◆ 19నుంచి 20 రౌండ్లలో లెక్కింపు
◆ 144 సెక్షన్ అమలు, మద్యం దుకాణాలు మూసివేత


కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి, డిసెంబర్2: అసెంబ్లీ ఎన్నికల్లో పోలైన ఓట్లను లెక్కించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. శనివారం జిల్లాలోని చిట్యాల ఏఎంసీ మార్కెట్ గోదాంలో ఉన్న ఈవీఎం గోదాంలో కౌంటింగ్ నిర్వహించనున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఆదివారం ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ మొదలు కానున్నది. కౌటింగ్‌కు గంటముందే అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లను కేంద్రంలోకి అనుమతిస్తారు. ఒక్కో మండలానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. 19 రౌండ్ల నుంచి 20రౌండ్లలో లెక్కింపు పూర్తికానున్నది. వనపర్తి నియోజకవర్గానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు జరగనున్నది.

### కలెక్టర్ పర్యవేక్షణ

వనపర్తి ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ పర్యవేక్షించారు. ఆయా రాజకీయ పార్టీలకు చెందిన నాయకుల వాహనాల పార్కింగ్, ఏజెంట్లను అనుమతించడం, మీడియా కోసం ఏర్పాట్లు చేశారు. ఒక్కో టేబుల్‌కు ముగ్గురు సిబ్బంది ఓట్ల లెక్కింపు బాధ్యతలు నిర్వహిస్తారు. ఈ లెక్కన 14టేబుళ్లకు 42 మంది పనిచేస్తారు. కాగా కౌంటింగ్ కేంద్రం వద్ద భారీ భద్రత కల్పిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారన్నారు. హాల్లో లైటింగ్, విద్యుత్ సరఫరా, సౌండ్ సిస్టం, టేబుళ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లోకి ఇతరులెవరూ లోనికి వెళ్లకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలో ఓట్లు లెక్కింపు విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది, అభ్యర్థులు, ఏజెంట్ల రాకపోకల కోసం వేర్వేరు మార్గాలతో ఏర్పాటు చేసిన బారికేడ్లు పరిశీలించారు.

### 144 సెక్షన్ అమలు

అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఓట్ల లెక్కింపునకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈనెల 3వ తేదీ ఆదివారం జిల్లా కేంద్ర సమీపంలోని చిట్యాల ఏఎంసీ గోదాంలో నిర్వహించనున్న ఓట్ల లెక్కింపు సందర్భంగా ఆయా పరిసరాల్లో ఆదివారం ఉదయం 6గంటల నుంచి 4వ తేదీ సోమవారం ఉదయం 6 గంటల వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఈ సమయంలో ఐదుగురి కంటే ఎక్కువ వ్యక్తులు గుమిగూడడాన్ని నిషేధించినట్లు తెలిపారు. ఏజెంట్లకు గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నామన్నారు. ఫలితాల అనంతరం 4న ర్యాలీ నిర్వహణకు సంబంధిత పోలీస్ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలన్నారు.

## భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ


కౌంటింగ్ కేంద్రం వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ రక్షితాకృష్ణమూర్తి

వనపర్తి టౌన్, డిసెంబర్ 2: జిల్లా కేంద్రంలోని ప్రధాన ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని ఎస్పీ రక్షితాకృష్ణమూర్తి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిట్యాల పరిధిలోని వ్యవసాయ మార్కెట్ గోదాంలో ఉన్న కౌంటింగ్ కేంద్రంలో కౌంటింగ్ సజావుగా సాగేలా ప్రజలు సహకరించాలని, ఆదివారం ఉదయం 6గంటల నుంచి సోమవారం 6గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఈ సమయంలో ఐదుగురి కంటే ఎక్కువ వ్యక్తులు గుమికూడడం నిషేధమని, కౌంటింగ్ కేంద్రం పరిధిలోని కిలోమీటర్ వరకు ప్రజలు గుమికూడవద్దని, టపాసులు కాల్చరాదని హెచ్చరించారు. 3న విజయోత్సవ ర్యాలీలు చేయడం నిషేధమని, మొబైల్ ఫోన్స్, అగ్గిపెట్టెలు, లైటర్లు వంటి నిషేధిత వస్తువులు కౌంటింగ్ హాల్‌లోకి తీసుకురావద్దని సూచించారు. ప్రతిఒక్కరూ పోలీస్, రెవెన్యూ సిబ్బందికి సహకరించాలని, ఎవరైనా నిబంధనలు పాటించకుంటే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. హాజరయ్యే అభ్యర్థులు, ఏజెంట్లు, మీడియా ప్రతినిధులు పోలీస్ సూచనలు పాటించాలని సూచించారు. ఎస్పీ వెంట డీఎస్పీ ఆనంద్‌రెడ్డి, సీఐలు తదితరులు ఉన్నారు.

## ఇంట్లో దోమలను నివారిద్దాం

◆ అసిస్టెంట్ మలేరియా అధికారి శ్రీనివాస్‌జీ


సిమెంట్ హౌస్‌ను శుభ్రం చేయిస్తున్న అధికారులు

కొత్తకోట, డిసెంబర్ 2: ప్రతిఇంట్లో దోమలను నివారించాలని అసిస్టెంట్ మలేరియా అధికారి శ్రీనివాస్‌జీ అన్నారు. శనివారం కొత్తకోటలోని ఎస్సీ కాలనీలో మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, విషజ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇండ్ల పరిసరాల్లో వృథాగా ఉన్న సిమెంట్ హౌస్‌లు, కుండలు, టైర్లు మొదలైన వ్యర్థ పదార్థాలను తీసి వేయాలని సూచించారు. నిరంతరం ప్రతి ఒక్కరూ స్పెషల్ డే దినాన్ని పాటించి ప్రజలంతా వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బీటీ రాణి, సిబ్బంది రాజు, శ్రీనివాస్, మధుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

పాన్‌గల్, డిసెంబర్ 2: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని సింగిల్‌విండో కార్యనిర్వాహక అధికారి భాస్కర్‌గౌడ్ అన్నారు. శనివారం మండలకేంద్రంతోపాటు మాందాపూర్, దవాజీపల్లిలోని వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం క్వింటాకు రూ.2,203 మద్దతు ధర ప్రకారంగా చెల్లించడం జరుగుతుందని తెలిపారు. రైతులు ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో విండో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## గ్రామాలవారీగా ఓట్ల నమోదు

వీపనగండ్ల, డిసెంబర్2: నవంబర్ 30న నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా మండలంలో 28 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 22,753 ఓటర్లకుగానూ 19,125మంది ఓటుహక్కును వినియోగించుకోవడంతో 84శాతం పోలింగ్ నమోదైనట్లు తాసీల్దార్ వరలక్ష్మి తెలిపారు. గ్రామాల వారీగా తీసుకుంటే వీపనగండ్లలో 3,714మంది ఓటర్లకుగానూ 3,004, గోవర్ధనగిరిలో 1,720 మంది ఓటర్లకు 1,506, సంగినేనిపల్లిలో 2,548 మంది ఓటర్లకు 2,211, నాగర్లబండతండాలో 347మంది ఓటర్లకుగానూ 303, తూంకుంటలో 2,747మంది ఓటర్లకు 2,026, సంపత్‌రావు పల్లిలో 851మంది ఓటర్లకు 768, రంగవరంలో 344మంది ఓటర్లకు 316 మంది, గోపల్‌దిన్నెలో 1,463మంది ఓటర్లకు 1,224, పులగర్‌చర్ల 1,624మంది ఓటర్లకు 1,441, కల్వరాల 3,407మంది ఓటర్లకు 2,838, బొల్లారం 2,416మంది ఓటర్లకు 2,039మంది, కొర్లకుంటలో 440 మంది ఓటర్లకు 382, వల్లభాపురం 1,132మంది ఓటర్లకు 969మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు.

## జాతీయ స్థాయి ఖోఖోకు బయలుదేరిన తెలంగాణ జట్టు

కొత్తకోట, డిసెంబర్ 2: మహారాష్ట్రలోని నాసిక్‌లో ఈనెల 3వ తేదీనుంచి 7వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి అండర్-17 బాలుర, బాలికల ఖోఖో టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు తెలంగాణ ఖోఖో జట్టు శనివారం బయలు దేరింది. బాలుర జట్టుకు సోఫీపూర్ జెడ్పీహెచ్ఎస్ పీఈటీ మన్యంయాదవ్, అమడబాకుల జెడ్పీహెచ్ఎస్ పీఈటీగా పనిచేస్తున్న రామ్మోహన్ బాలకల జట్టుకు కోచ్‌గా యాపర్ల జెడ్పీహెచ్ఎస్‌లో పనిచేస్తున్న అనిల్‌కుమార్ వ్యవహరిస్తున్నారు. జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొంటున్న తెలంగాణ జట్టుకు తెలంగాణ క్రీడా కార్యదర్శి రాందిరెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి సురేందర్‌రెడ్డి ఇరుజట్లు పీఈటీలకు శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ స్థాయిలో ఆడుతున్న బాలుర, బాలికల జట్టుకు కొత్తకోటలోని శ్రీమహలక్ష్మి జ్యూవెలర్స్ యజమాని అరుణ్‌కుమార్‌చారి క్రీడా దుస్తులను అందజేశారు.


జాతీయ స్థాయిలో ఆడేందుకు బయలుదేరుతున్న బాలుర, బాలికల జట్టు